గృహసారథులు కీలక భూమిక పోషించాలి

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రౌతు సూర్యప్రకాశరావు
- మూడు గ్రామాల్లో గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సదస్సులు



మహదేవపట్నం సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, చిత్రంలో నియోజకవర్గ పరిశీలకుడు రౌతు సూర్యప్రకాశరావు

ఉండి: రానున్న రోజుల్లో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు అందిస్తూ కీలక భూమి పోషించాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ పరిశీలకుడు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. సోమవారం ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డు, మహదేవపట్నం, యండగండి గ్రామాలలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మహదేవపట్నంలో ఉప సర్పంచ్ ముదునూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పీవీఎల్, సూర్యప్రకాశరావు మాట్లాడుతూ టీడీపీ మరోసారి కుయుక్తులతో అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోందన్నారు. ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంత మేలు చేస్తున్నా దానిని తప్పుడు కోణంలో ప్రజలకు చూపిస్తున్నారన్నారు. కానీ పొందిన మేలు మర్చిపోవడానికి ప్రజలు చంద్రబాబు వంటివాళ్లు కాదన్నారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు జరిగిన మేలు, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన మేలేంటీ అని పచ్చమీడియా, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పరిశీలిస్తే మంచిదన్నారు. చంద్రబాబు పాలనలో ఇచ్చిన పింఛను ఎంత, ఎంతమందికి ఇచ్చారు, ఇళ్ల స్థలాలు ఇచ్చారా, ఇళ్లు కట్టించారా, అమ్మ ఒడి ఇచ్చారా, రైతు భరోసా ఇచ్చారా, జగనన్న చేయూత, చేదోడు, డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ వీటిలో చంద్రబాబు ఏమి ఇచ్చారో వారు ప్రజలకు చెప్పాలన్నారు. చంద్రబాబు పాలనలో తెచ్చిన రూ.వేల కోట్లు అప్పులు దోచుకున్నారని, ప్రస్తుత పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అప్పులు ప్రజల కోసమని వారి సంక్షేమం కోసమేనని ఖర్చు చేశారన్నారు. వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమాన్ని, చంద్రబాబు హయాంలో జరిగిన దోపిడీని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలకు వివరంగా తెలియజేయాలన్నారు. ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ఎప్పుడు ఓట్లు వేద్దామా ఆయన్ని సీఎం చేద్దామా అని ఎదురు చూస్తుంటే పచ్చమీడియా, చంద్రబాబు, అతని దత్త పుత్రుడు మాత్రం పిచ్చికూతలు కూస్తున్నారని పీవీఎల్, సూర్యారావు మండిపడ్డారు.

టీడీపీ కోటలో పీవీఎల్ పాగా ఖాయం

వచ్చే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రౌతు సూర్యారావు అన్నారు. గతంలో మాదిరి కాకుండా ఇప్పుడు కేవలం అర్హతను బట్టి రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమ పథకాలతో ప్రజలు నిజం తెలుసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలుకు ప్రజలంతా రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అందుకే వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పీవీఎల్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలంతా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ, మహంకాళి, రాష్ట్ర డైరెక్టర్ కొత్రపాటి అనిత, పీవీఆర్‌కే ఆంజనేయరాజు, గలావిల్లి ధనుంజయ, ముదునూరి సుబ్బరాజు, సర్పంచ్‌లు కమతం సౌజన్య, ముదునూరి వెంకటసోమరాజు, గోగులమండ చినకృష్ణమూర్తి, కొండవేటి శివయ్య, పిన్నంరాజు నాగలక్ష్మి, గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, తాటిపట్టి పెదవీరప్ప, కరిమెరక చంద్రరావు, యేడిద వెంకటేశ్వరావు, జీ సుందర్‌కుమార్, వేగేశ్న వెంకట్రామరాజు, కమతం బెనర్జీ, కరిమెరక శివనాగరాజు, వైఎస్ ఎంపీపీలు కనకమహాలక్ష్మి, సుజాతరాణి, పాలా రమేష్, సుంకర సింగినాయుడు, బాలం తులసీ, కొలాతి రాజు, బలే శేఖర్, బొక్కా శ్రీను, కర్రి శ్రీను పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి ఆక్వా సమస్యలు



భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు రొయ్యల రైతుల సమస్యలపై వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విద్యుత్ రాయితీ విషయంలో ఆక్వా రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రొయ్యల సాగులో జోన్స్ పేరుతో ఆక్వా రైతుల విద్యుత్ సర్వీసులను విభజించి రాయితీ లేకుండా చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వీరవాసరం మండలానికి చెందిన ఆక్వా రైతులు సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆక్వా, వరి సాగు చేస్తున్న రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటున్నారని కరోనా సమయంలో కూడా ఆక్వా రైతులను ఆదుకునేందుకు అనేక చర్యలు తీసుకున్న వైనాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో రొయ్యల సంఘం రైతులు భోగిరెడ్డి శ్రీనివాసరావు, పంజా మాణిక్యాలరావు, మళ్ల తులసీరామ్, గూడూరి ఓంకార్, పంజా వెంకటేశ్వరరావు, గంధం కేశవరావు, కావలి దామోదరరావు, వన్నెంరెడ్డి సుబ్రమణ్యం, నాగరాజు గోపిరాజు, కడలి నెహ్రూ, యరకరాజు హరనాథరాజు యరకరాజు పెదబాబు, కడలి శ్రీరాములు తదితరులున్నారు.

రాజ్యలక్ష్మికి సత్కారం



కాకర్ల రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆకివీడు: స్థానిక సంతపేటలోని కల్యాణ రామాలయంలో మాఘమాసం సందర్భంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సుమారు 200 మంది మహిళలు విష్ణు సహస్రపారాయణం చేశారు. పారాయణాలు చేస్తున్న గీతా మహిళా మండలి అధ్యక్షురాలు కాకర్ల రాజ్యలక్ష్మిని సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోమటి రాంబాబు, సన్నిధి రామ వెంకటేశ్వరరావు, ఈరి లక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగిస్తే భవిష్యత్ అంధకారం



దుంపగడప కళాశాలలో అవగాహన సమావేశం దృశ్యం

ఆకివీడు: మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకం, రవాణా వంటి చర్యల్ని ప్రభుత్వం నిషేధించిందని, అటువంటి వాటిని కలిగి ఉన్నా నేరమేనని ఎక్సైజ్ సీఐ రామరావు అన్నారు. సోమవారం దుంపగడపలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదభరితమైన డ్రగ్స్ వినియోగంతో శరీర అవయావాలు కుంచించుకుపోతాయన్నారు. ఎస్సై కే.రాజారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగానికి కొంత మంది విద్యార్థులు అలవాటు పడుతున్నారని, అది ప్రమాదకరమని హెచ్చరించారు. విద్యార్థులు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం ను ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని చెప్పారు. ఎవరైనా వాటిని వినియోగించినా, రవాణా చేసినా 14500 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. వీరి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కాలేజీలో మాదక ద్రవ్యాల వినియోగ నిషేధిత కమిటీని ప్రిన్సిపాల్ కే.సుజాత అధ్యాపకులు, విద్యార్థులతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో నిధుల వినియోగంపై పంచాయతీ రాజ్ అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎండీఎఫ్ పథకంలో రూ.80 లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధులను గ్రామ సచివాలయ రూ 20 లక్షల నిధులకు అనుసంధానం చేస్తూ గడపగడపకు మన ప్రభుత్వంలో చూసిన సమస్యల పరిష్కారానికి వినియోగిస్తామని చెప్పారు. దెయ్యాలతిప్ప, కోమటి తిప్ప, దొంగపిండి, తోకలపూడి, పంజా వేమవరం, నాగిడిపాలెం, వెంకట తిప్ప, యనమదుర్రు, గొల్లవాని తిప్ప గ్రామాలకు ఈ నిధులను కేటాయించామన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం మేరకు నియోజకవర్గాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ జి.స్వామి నాయుడు, జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుకాణాల్లో తూకం మోసాలపై తనిఖీలు



కాళ్లలో మాంసం దుకాణంలో కాటా తనిఖీ చేస్తున్న సిబ్బంది

కాళ్ల: మండలంలోని కాళ్ల, సీసలి, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో కాళ్ల గ్రామంలోని సినిమా హాల్ సెంటర్లోని మాంసం దుకాణంలో కేజీకి సుమారు 100 గ్రాముల తేడా రావడంతో కేసు నమోదు చేశారు. రాంబాబు మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా స్టాంపులు లేని కాటాలకు స్టాంపులు వేశామన్నారు. తూనికలు, కొలతల విషయంలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. వినియోగదారులను మోసం చేసే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో సిబ్బంది అమ్మారావు షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీపై ప్రజల్లో అవగాహన అవసరం



లెప్రసీపై అవగాహన కోసం కరపత్రాలు అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రజల్లో చైతన్యంతో లెప్రసీ అంతరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని భీమవరం సీఎస్ఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ చీడే సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా సీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 35 ఏళ్లుగా సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్ ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తులకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్ మాట్లాడుతూ లెప్రసీపై సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్ డైరెక్టర్ సిస్టర్ ఎలిధ్రా, ఏవో ఆకుల పెద్దిరాజు, ల్యాబ్ టెక్నీషియన్ రాజకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేంద్ర, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువు తవ్వకంపై స్పందనలో ఫిర్యాదు

కాళ్ల: నిబంధనలకు విరుద్ధంగా పంట బోదెను ఆనుకుని చెరువు తవ్వకాలు చేస్తున్న ఆక్వా చెరువు యజమానులపై చర్యలు తీసుకోవాలంటూ కోమటి గుంట గ్రామానికి చెందిన గుర్రం వెంకట పరమేశ్వరరావు, మంతెన నాగాంజనేయులుతో పాటు పలు రైతులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. కాళ్ల మండలం కోమటిగుంట గ్రామ పరిధిలో గోబందుల పంట బోదెకు ఇరువైపులా ఆక్వా చెరువులు తవ్వుతున్నారు. అయితే పంటబోదెకు మూడు మీటర్లు వదిలి ఆక్వా చెరువులు తవ్వుకోవాలని ప్రభుత్వం నిబంధనలు స్పష్టంగా ఉన్నా అవేమీ పట్టించుకోకుండా పంటబోదె అంచును చేర్చి చెరువు గట్టు వేస్తున్నారని ఆరోపించారు. ఈ పంటబోదె ద్వారానే శివారులో ఉన్న తమ పొలాలకు నీరు పెట్టుకోవాలన్నారు. 8 మంది చిన్న చిన్న రైతులకు చెందిన భూమి బీడు వారి పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయమై స్థానిక మత్స్యశాఖ అసిస్టెంట్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మధ్యాహ్న భోజన పథకంలో నిబంధనలు పాటించాలి



భీమవరం పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో భోజనాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు

సాక్షి, భీమవరం: జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎండీఎం జిల్లా కో-ఆర్డినేట్ కె.కృష్ణారావు అన్నారు. భీమవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన మెను ప్రకారం ఆహారపదార్థాల కొలతలు, వండే విధానంలో నిబంధనలు పాటించాలన్నారు. ఆహార పదార్థాలు రుచికరంగా తయారు చేస్తేనే ఎక్కువ మంది పాఠశాలలో భోజనం చేస్తారన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె.సుధారాణి, ఈశ్వరి, టి.జోత్స్న, పి.జ్ఞానమూర్తి, వీఎం రాధాకృష్ణ, కేవీబీ సూర్యనారాయణ, ఎం.సీతారామ్ పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పిచికారీతో ఖర్చు ఆదా

పెనుమంట్ర: డ్రోన్ ద్వారా పురుగుమందులు, ద్రవరూపంలోని ఎరువులను పిచికారీ చేయవచ్చని పెనుమంట్ర మండల వ్యవసాయశాఖాధికారి ఎం.జయదుర్గామాధురి చెప్పారు. సోమవారం పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలోని సత్తి లోకేష్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయదుర్గామాధురి మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా ఎకరానికి రూ.250 నుంచి రూ.300 వరకు ఖర్చు అవుతుందని, 10 నుంచి 15 నిమిషాలలో పిచికారీ పూర్తవుతుందని తెలిపారు. ఏఆర్ఎస్ మార్టేరు టెక్నికల్ సిబ్బంది బి.హేమలత మాట్లాడుతూ డ్రోన్ ద్వారా రోజుకి 20 ఎకరాల వరకు పిచికారీ చేసుకోవచ్చన్నారు. అంతేకాక పురుగుమందుల మోతాదు 25 శాతం వరకు తగ్గుతుందని తెలిపారు. సీహెచ్‌సీ గ్రూపులకు వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై డ్రోన్‌లను అందిస్తామని, కావాల్సినవారు మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తపూసలమర్రు గ్రామానికి చెందిన తిరుమాని వెంకటస్వామి (39) మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న రాత్రి భీమవరం నుంచి ద్విచక్రవాహనంపై కొత్తపూసలమర్రులో ఇంటికి వెళుతున్నాడు. గూట్లపాడు వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు అతని తండ్రి తిరుమాని శివన్నారాయణకు సమాచారం అందించగా, తండ్రి కుమారుడు వెంకటస్వామిని భీమవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ వెంకటస్వామి సోమవారం మృతి చెందాడు. తండ్రి శివన్నారాయణ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 మంది జూదరుల అరెస్టు..
రూ.1.34 లక్షల నగదు స్వాధీనం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం నరసింహపురం గ్రామంలోని మామిడి చెరువు గట్టు వద్ద పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.34 లక్షల నగదును స్వాధీనం చేసుకుని వారిపై ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పోస్టల్ డిపాజిట్లపై పెరిగిన వడ్డీ రేట్లు

సాక్షి, భీమవరం: తపాలా శాఖలో వడ్డీ రేట్లను గణనీయంగా పెంచినట్లు తపాలా శాఖ భీమవరం డివిజన్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది డిపాజిట్‌పై 6.6 శాతం, రెండేళ్ల డిపాజిట్‌పై 6.8 శాతం, మూడేళ్ల డిపాజిట్‌పై 6.9 శాతం, ఐదేళ్ల డిపాజిట్‌పై 7 శాతం, సీనియర్ సిటిజన్ ఖాతాలపై 8 శాతం, మంత్లీ ఇన్‌కం ఖాతాలపై 7.1 శాతం ఇవ్వనున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాలసుబ్రహ్మణ్యం కోరారు.

వాణీ జయరాంకు నివాళి



వాణీ జయరాం సంతాప సభ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రముఖ గాయని వాణీ జయరామ్ సంతాప సభ స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో శ్రీ విజ్ఞాన వేదిక అధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వాణీ జయరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు సంగీత నాటక పరిషత్ కార్యదర్శి ఆరేటి ప్రకాష్ మాట్లాడుతూ తన గానామృతంతో అలరించిన వాణీ జయరాం మృతి తీరని లోటని అన్నారు. త్యాగరాజ భక్త సభ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో దాసరి మల్లిఖార్జునరావు (చిన్ని), కొండ్రు శ్రీనివాస్, కారుమూరి చినబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, మామిళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ హాజరు నుంచి మినహాయించాలి



ఉండిలో వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు

ఉండి: వీఆర్ఏలను ఫేస్ యాప్ హాజరు నుంచి మినహాయించాలని వీఆర్ఏల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.ఆంజనేయులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఉండిలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ నెట్‌వర్క్ సిగ్నల్ సౌకర్యం అంతంత మాత్రంగా ఉండటం వల్ల హాజరు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. వీఆర్ఏలు ముత్యాలపల్లి గణేష్, వై.ప్రసాద్, బాషా, ఎం.రాజగోపాలం, పీ శ్రీనివాస్, పీ గోపాలకృష్ణ, కే సింహాచలం, కే బాలామణి పాల్గొన్నారు.

ఐటీఐ ఏసీ కోర్సులో శిక్షణ

సాక్షి, భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), డైకిన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎయిర్ కండిషనర్ కోర్సుపై శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండి రోడ్డులోని ఐటీఐ కళాశాలలో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సర్టిఫికెట్ ఇస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి చేపట్టిన ఈ శిక్షణకు పదో తరగతి చదివి 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాలలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 86885 94244 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కృష్ణారెడ్డి కోరారు.

మినీ షిర్డి వార్షికోత్సవాలు ప్రారంభం



మిని షిర్డిలో పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం 14వ వార్డులోని శ్రీఅభయసాయి ధ్యాన మందిరం (మినీ షిర్డి) 30వ వార్షిక మహోత్సవాలు సోమవారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. శ్రీషిర్డిసాయి సత్సంగ సేవాశ్రమం ట్రస్ట్ కోశాధికారి అడబాల సాయి శివకుమార్ దంపతులచే అర్చకులు వేద మంత్రాలతో సాయినాథుని హోమం నిర్వహించారు. ఈ నెల 11 వరకు వార్షిక మహోత్సవాలు నిర్వహిస్తామని, 9న రుద్రాభిషేకం, తులసిదళం, చామంతి పుష్పాలతో విశేషార్చన, 11న బాబా వారికి 22 ద్రవ్యాలతో అభిషేకం, అన్నాభిషేకం, అన్నదానం చేస్తామని, భక్తులందరూ పాల్గొనాలని మేనేజింగ్ ట్రస్టీ నిర్మల శారదా సాయి, కార్యదర్శి అడబాల సాయిరామ కుమార్, కోశాధికారి శివ కుమార్ కోరారు.

రేపు కంటి వైద్య శిబిరం

మొగల్తూరు: స్థానిక అందేబాపన్న జూనియర్ కళాశాలలో నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు ఘంటసాల బ్రహ్మాజీ సోమవారం చెప్పారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డులను వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు.

మావుళ్లమ్మ ఉత్సవాలు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సరస్వతీ భజన సమాజం భీమవరంచే భజన కార్యక్రమం, 4 గంటలకు శ్రీతులసీ మాత భగవద్గీత ప్రచారపీఠం ఖమ్మంచే భగవద్గీత ప్రవచనాలు, సాయంత్రం 5 గంటలకు మౌనిక ఆర్కెస్ట్రా భీమవరం వారిచే సినీ మ్యూజికల్ నైట్, రాత్రి 8 గంటలకు ఉమాశ్రీ వాణి కళానికేతన్ రాజమండ్రి వారిచే సత్యహరిశ్చంద్ర నాటకం ఆకట్టుకున్నాయి. ఆకివీడు పండ్ల, పూల వర్తక సంఘం తరఫున అమ్మవారిని గజమాలతో అలంకరించారు. కార్యక్రమంలో నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవాల్లో సోమవారం సాయంత్రం 4 గంటలకు భగవద్గీత ప్రవచనాలు, 5 గంటలకు కూచిపూడి జానపద నృత్యాలు, 8 గంటలకు గయోపాఖ్యానం నాటిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సర్వేలు నిబద్ధతతో చేయాలి

భీమవరం అర్బన్: ఏ ఒక్క లబ్ధిదారుడికి అన్యాయం జరగకుండా సర్వేలను నిబద్ధతతో చేయాలని ఎంపీడీఓ రామచంద్ర ప్రభు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు సర్వేలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్, సిటిజన్ అవుట్ రీచ్ తదితర సర్వేలను క్షేత్రస్థాయిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిబద్ధతతో చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

9 వేల ఎకరాలకు ఈ క్రాప్ నమోదు

భీమవరం అర్బన్: మండలంలో దాళ్వా సాగుకు సంబంధించి 9 వేల ఎకరాలలో ఈ-క్రాప్ నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో సుమారు 9,200 ఎకరాలలో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టారని ఇంతవరకు 9 వేల ఎకరాలలో ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. ఈ-క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు.

స్పందనలో 3 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందనలో మూడు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్ సోమవారం చెప్పారు. మండలంలోని కాళింగగూడెంలో ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ సర్పంచ్ గురువెల్లి అన్నపూర్ణ అర్జీ అందించారన్నారు. అలాగే గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులతో పనులు చేపట్టాలని కోరారన్నారు. కాళింగగూడెంలో ఆస్తి తగాదాపై న్యాయం చేయాలని వృద్ధురాలు ఫిర్యాదు చేశారని చెప్పారు. స్పందన కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లపై వైట్ మార్కింగ్ వేయాలి

పాలకోడేరు: జిల్లాలో ఉన్న స్పీడ్ బ్రేకర్లను గుర్తించేందుకు వైట్ మార్కింగ్ వెయ్యాలని శృంగవృక్షం గ్రామాభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. స్పీడ్ బ్రేకర్లపై ఎలాంటి మార్కింగ్‌లు లేనందున రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్ష



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ నాగ ప్రసాద్

పాలకోడేరు: హెల్మెట్లు ధరించడం తలకు భారం కాదని, ఆపదలో ప్రాణరక్షణకు సహాయపడుతుందని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. శృంగవృక్షంలో హెల్మెట్ ధారణపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్లు లేనందున ప్రమాదాల సమయంలో తలకు గాయాలు అవ్వడం వల్లనే ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ప్రతి వాహనచోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు సిబ్బంది ఉన్నారు.